

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

మంగళవారం,29 ఏప్రిల్ 2025 | 8

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా


# పక్కా ప్లాన్‌తో..

# కాసుల దందా




## రమణయ్యపేట గ్రామపంచాయితీలో అక్రమ నిర్మాణాలు



ఆక్యుపెన్సీ తీసుకుని బరితెగించి అక్రమ అంతస్థు నిర్మాణం


- పంచాయితీ కార్యదర్శి అమ్యామ్యాలు మింగి మాయ
- మినిమమ్ రూ.2 లక్షలు రేట్ ఫిక్స్ ఆపై ఎంతైనా
- అక్రమ నిర్మాణాలకు అండదండలు... తుంగలో తొక్కుతున్న నిబంధనలు
- ఎల్.పి.నెం.22/14లో ప్లాట్ నెం.7,8,9లో ఆక్యుపెన్సి తీసుకుని అరాచక నిర్మాణం
- బరితెగించి మరో అంతస్థు నిర్మాణం వల్ల ఆక్యుపెన్సి రద్దు డిమాండ్
- ఎల్.పి.నెం.23/86 ప్లాట్ నెం.53లో పక్కా ప్లాన్‌తో అక్రమాలు
- గత కార్యదర్శి ఇచ్చిన అక్రమాల బి.ఎ.నెం.83/2024 నిలుపుదల చేయాలని డిమాండ్
- రమణయ్యపేట పంచాయితీలోకి అవినీతి జబ్బు - కుడా అధికారుల సహకారంపై ప్రజల్లో అనుమానాలు!



కుడా నుంచి అనుమతి పొందిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్



అనుమతులకు మించి నాలుగో అంతస్థు అక్రమ నిర్మాణం



బి.ఎ.నెం.83/2024 ప్లాన్ కాపీ

**ఓవైపు భవన నిర్మాణాల్లో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామంటూ మున్సిపల్ శాఖమంత్రి నారాయణ ప్రకటనలు చేస్తూ జీవో నెం.4, 5, 20 లను తీసుకొచ్చారు. ప్లాన్ మంజూరులో అనేక మార్పులు చేశారు. ఇంత జరుగుతున్నా రమణయ్యపేట పంచాయితీ కార్యదర్శుల అవినీతి, కాసుల దందా, అక్రమార్కులతో కలిసి చేస్తున్న అరాచకం ఆపలేకపోవడం గమనార్హం. పంచాయితీ కార్యదర్శి అమ్యామ్యాలకు అలవాటు పడి భవన అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం పెడుతున్నారు. ఎల్.పి. నెం. 22/14లో ప్లాట్ నెం. 7,8,9 మూడు కలిపి సిల్ట్, ఐదు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు పొంది, నిర్మాణాన్ని పూర్తి చేసి 2024 లో ఆక్యుపెన్సీ తీసుకున్నారు. ఇప్పుడు నిబంధనలకు వ్యతిరేకంగా అదనంగా మరో అంతస్తు నిర్మాణానికి పక్కా ప్లాన్‌తో బరితెగించారు. బిల్డర్ నూకల శివప్రసాద్‌తో చేతులు కలిపి పంచాయితీ కార్యదర్శి లక్షల్లో కాసు లు మింగి ఈ అక్రమానికి పూర్తి అండదండలు అందించినట్లు విశ్వసనీయంగా చేబుతున్నారు. అక్రమార్కులపై చర్యల్లో భాగంగా ఇచ్చిన ఆక్యుపెన్సీని రద్దు చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.అదే పంచాయతీ పరిధిలో మరో ఎల్.పి.నెం. 23/86లో ప్లాట్ నెం.53లో గత కార్యదర్శి వెంకటరమణ లక్షల్లో కాసులు మింగి సిల్ట్ మూడు అంతస్తుల్లో అపార్ట్‌మెంట్ ప్లాన్ ఇచ్చేసారు. ఒక ఫ్లోర్‌లో రెండు వంట గదులు మద్యలో మేట్లు నిర్మించుకోవడానికి ప్లాన్ మంజూరు చేసే అధికారం పంచాయితీ కార్యదర్శికి ఉండదు. ఒక ఫ్లోర్ నిర్మాణంలో ఒకే వంటగది ఏర్పాటుకు ప్రాన్‌లో అనుమతులు మాత్రమే ఇవ్వాలి.కానీ నిబంధనలకు వ్యతిరేకంగా గత కార్యదర్శి ప్లాన్ మంజూరు చేయగా...సదరు బిల్డరు మరో అంతస్తు అనగానాలుగో అంతస్తు అక్రమంగా నిర్మించాడు. అక్రమంగా నిర్మిస్తున్న అపార్టుమెంటుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రమణయ్యపేట గ్రామ పంచాయితీ లో అవినీతి, అక్రమ నిర్మాణాలపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రామ పంచాయితీ పరిధిలో అవినీతి రాజ్యమేలుతోంది. కాసుల కక్కుర్తితో పంచాయితీ కార్యదర్శులు అమ్యామ్యాలు పుచ్చుకోవడం...అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తుండడంపై తీవ్ర విమర్శలువెల్లువెత్తుతున్నాయి..అక్రమాలను అడ్డుకోవాల్సిన పంచాయితీ అధికారులే... కాసులు మింగి అనుమతులకు మించి అదనపు అంతస్తుల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడకు ఆనుకొని ఈ గ్రామం ఉండటం వల్ల ఖాళీ స్థలాలు,ఇళ్లు, అపార్ట్మెంట్ల ధరలు విపరీతంగా పెరిగి మంచి డిమాండ్ ఏర్పడింది. దాంతో బిల్డర్లు రెచ్చిపోతున్నారు. అధికారులతో జతకట్టి పక్కా ప్లాన్‌తో అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈఅక్రమ నిర్మాణాల నుంచి దండుకో వడమే ధ్యేయంగా అధికారులు పనిచేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

**ఓసి తీసుకుని బరితెగింపు..** ఎల్.పి.నెం. 22/14లో ప్లాట్ నెం.7,8,9 బి.ఎ.నెం.1104/0008/బి/కెకెడిఆర్ఎండి2/ ఆర్ఎంపిటి/ 2022గా సిల్ట్ మరియు ఐదు అంతస్తుల అపార్టుమెంట్ నిర్మాణానికి అనుమతులు పొందారు. బిల్డింగ్ నూకల శివప్రసాద్ ప్లాన్ ప్రకారం పక్కాగా నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు.గత సంవత్సరం దస్తావేజు నెం.642/2022 మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తొలగించి కుడా నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందారు. ఆతరువాత పక్కా ప్రణాళికతో అక్రమాల కాండ ప్రారంభించారు. వాస్తవానికి ఆక్యుపెన్సి పొందిన తర్వాత ఆ అపార్టుమెంటుపై ఎటువంటి నిర్మాణాలు నిబంధనల ప్రకారం చేయకూడదు. కానీ బరితెగించిఆరోనిర్మాణానికిఅక్రమార్కులు చేపట్టారు.ఇలా అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే మంజూరు చేసిన ఆక్యుఫెన్సీ సర్టిఫికెట్ను 'కుడా' అధికారులు రద్దుచెయ్యాలి.వాసుల కక్కుర్తి తోఅవినీతికి పాల్పడుతున్న పంచాయితీకార్యదర్శిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి.ఈ అక్రమ నిర్మాణం వెనుక లక్షల్లో సొమ్ములు చేతులు మారినట్లు చెబుతున్నారు.

**అంతా అక్రమమే...**రమణయ్యపేట గత కార్యదర్శి అవినీతి తవ్వేకొద్దీ బయటపడుతోంది. తనకులేని అధికారంతో అక్రమంగా అపార్ట్మెంట్ బిల్డింగ్అనుమతులు మంజూరు చేసి ప్రభుత్వఖజానాకినష్టం కలిగించారు. బి.ఎ.నెం. 83/2024లోసిల్ట్ మరియుమూడు అంతస్థుల అపార్టుమెంటు నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. వాస్తవానికి సిల్ట్,మూడుఅంతస్థులు కేవలం ఇంటి నిర్మాణానికి మాత్రమే అనుమతులు ఇచ్చే అధికారం కార్యదర్శికి ఉంది. అనగా ఒక ఫ్లోర్‌లో ఒకటే కిచెన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి.అంతకన్నా ఎక్కువ వంటగదులు ఏర్పాటు చేసేలా అపార్ట్మెంట్ నిర్మించాలి అంటే కుడా నుంచి అనుమతులు పొందాలి. కుడా నుంచి అనుమతి తీసుకోవాలం టే ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులతోపాటు, నిర్మాణంలో కొంత భాగం మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. అక్రమ నిర్మాణానికి అవకాశం ఉండదు. కాబట్టి పక్కా ప్లాన్‌తో అక్రమార్కులు అక్రమ నిర్మాణాలకు పాల్పడడం కోసం పంచాయతీ కార్యదర్శికి లక్షల్లో లంచాలు ఇచ్చి బి.ఎ.నెం.83/2024గా అనుమతులకు పొంది..అక్రమంగా నాన్నకు

- తరువాయి 2లో..

# జ్యోతీష్య విద్యకు దిక్సూచి జాతక మాణిక్యం

**– ఎమ్మెల్యే కొండబాబు**
**– ఘనంగా జాతక మాణిక్యం పుస్తకావిష్కరణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పంచాంగకర్త, సిద్ధాంతి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి రచించిన జాతక మాణిక్యం పుస్తకం జ్యోతీష్య విద్యార్థులకు దిక్సూచీ వంటిదని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక చల్లా జగన్నాథ శర్మ కళావేదికలో సరిపెల్ల విరచిత జాతక మాణిక్యం పుస్తకావిష్కరణ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత భారతమాత చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వల చేసారు. అనంతరం మనోవిద్యాన శాస్త్ర పరిశోధకులు డాక్టర్ వింజరపు జనార్ధనం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొన్న జాతక మాణిక్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జ్యోతీష్య శాస్త్రంపై విశేష అధ్యయనం చేసిన సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి రాసిన జాతక మాణిక్యం పుస్తకం కాకినాడకు గర్వకారమన్నారు. ప్రస్తుత సమాజంలో తిధి, నక్షత్రం, జాతకం చూసుకునే పిల్లలకు జన్మనిచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జ్యోతీష్యానికి సంబంధించి పలు అంశాలపై సరిపెల్ల రచించిన ఈ పుస్తకం జ్యోతీష్య విద్యార్థులకు దిక్సూచీగా నిలుస్తుందన్నారు. ప్రముఖ సాహితీవేత్త కాశీ బోట్ల సత్యనారాయణ, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై డి రామారావు, కాకినాడ ఆర్డిఓ మల్లిబాబులు మాట్లాడుతూ జనసామాన్యంలోకి జ్యోతిష్యశాస్త్రాన్ని చేరువ చేయడమే ధ్యేయంగా దశాబ్దాలుగా శ్రీరామచంద్రమూర్తి రచనలు చేస్తున్నట్లు వివరించారు. ప్రముఖ పండితులు పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ తాను రచించిన పరిశోధన గ్రంథం జాతక మాణిక్యం సంస్కృత భాషలో ఋషీశ్వరులు చెప్పిన అనేక యోగ విశేషాలు సోదాహరణంగా తేటతెలుగు ఈ గ్రంథంలో వివరించాన న్నారు. ఈ శాస్త్రంపై మక్కువ గలవారికే కాకుండా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో జోతిష్య విద్యాభ్యాసం చేసేవారికి ఈ గ్రంథం చక్కగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సమావేశంలో పాలపర్తి సుబ్బారావు, చల్లా శ్రీనివాస్ నిరంజన్, సమయమంతుల శ్రీనివాస్ కుమార్, గొట్టుముక్కల వెంకట నరసింహ శాస్త్రి,కుటుంబంలో దీక్షితుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ జి.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ మామిడిపాటి సుబ్రహ్మణెళ్ళీశ్వరరావు, పున్నమ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో చలివేంద్రాల అవసరం

**– డాక్టర్ ఐ.వి.రావు**

**కాకినాడ,మేజర్న్యూస్ :** వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని దీని పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఐ.వి.రావు కోరారు. భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేట మోర్ స్టోర్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం డాక్టర్ ఐ.వి.రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవకాశముంటే గృహాల ముందు కూడా సిమెంటు తొట్టెలు ఏర్పాటు చేసి వాటిలో మంచినీరును ఉంచడం ద్వారా పశు వులకు కూడా నీరు అందించినవారు అవుతారని చెప్పారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా పాదచారులకు, వాహనదారులకు దాహార్తిని తీర్చిన వారవుతారని చెప్పారు. జూన్ మాసం వరకు ఈ చలివేంద్రాన్ని నిర్వహించేందుకు నిర్ణయించామని చెప్పారు.

ఈ చలివేంద్రంలో మజ్జిగ మరియు మినరల్ వాటర్ ను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేశామని చెప్పారు. వాతావరణ కాలుష్యం నివారణకు ప్లాస్టిక్ వినియోగాన్ని చేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



చేయడం జరిగిందని డాక్టర్ ఐ.వి.రావు వివరించారు. కార్యక్రమంలో అయ్యగారు వెంకటేష్, మండలిక వెంకటశాస్త్రి,కేసీతారాం, వి.ఎస్.ము రళి రావు,ఎం.వి.నారాయణ,చెరుకువాడ శాస్త్రి, కె.ఎస్.ఆర్.మూర్తి, నాగిని, ఇంద్రగంటి శ్రీనివాస్, ఇంద్రగంటి నాగేశ్వరి, గంటి భాస్కర్, కాకినాడ మధ్వసభ కమిటీ కోశాధాకారి వేముగంటి రాము ప్రభుత్రులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో ఎల్.హెచ్.ఎం.ఎస్. యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**– పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరి రాజు**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వేసవి సెలవులు సందర్భంగా తమ స్వంత ప్రాంతాలకు వెళ్ళే సమయాల్లో తమ ఇండ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్.హెచ్.ఎం.ఎస్. (లాక్డ్ హౌస్ మోనటరింగు సిస్టం) సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పెద్దాపురం డిఎస్పి కోరారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ దొంగతనాల నియంత్రణకు రాష్ట్ర పోలీసుశాఖ లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టం (ఎల్.హెచ్.ఎం.ఎస్)ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ఈ విధానం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన ఇల్లు విడిచిపెట్టి బయట ప్రాంతాలకు వెళ్ళే సమయాల్లోనే ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఎల్.హెచ్.ఎం.ఎస్. మొబైల్ యాప్ వినియోగం వలన ప్రజల ఆస్తుల రక్షణకు కవచంలా పని చేస్తుందన్నారు. ప్రజలెవరైనా తాము ఇల్లు విడిచి తమ స్వంత అవసరాలు లేదా పనులు లేదా ఉద్యోగరీత్యా లేదా పండగలకు లేదా ఏదైన ఇతర కారణాల వలన బయట ప్రాంతాలకు వెళ్తున్నట్లుగా సంబంధిత పోలీసు స్టేషనుకు ముందస్తు సమాచారాన్ని అందించినట్లయితే పోలీసులు ఎల్.హెచ్.ఎం.ఎస్. సౌకర్యాన్ని



ఉచితంగా అందిస్తారన్నారు. ఇందుకుగాను వారు తమ స్మార్ట్ ఫోనులో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఎల్.హెచ్.ఎం.ఎస్. యాప్ ను డౌన్లోడు చేసుకొని, ఇంటి నుండే తమ పేరు, ఫోను నంబరు, లొకేషను వంటి ఇతర వివరాలను, ఎల్.హెచ్.ఎం.ఎస్.సేవలను ఎప్పటి నుండి ఎప్పటి వరకు పొందాలన్న విషయాలను యాప్లో నమోదు చేసి, రిక్వెస్ట్ పంపాలన్నారు.

రిక్వెస్ట్ పంపిన తరువాత వారి మొబైల్ నంబరుకు ఒక రిజిస్ట్రేషను నంబరు వస్తుందని, ఈ నంబరునే యూజర్ ఐడిగా పొందవచ్చునన్నారు. ఇలా రిక్వెస్ పంపిన తరువాత సంబంధిత పోలీసు స్టేషను నుండి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ఆయా ఇండ్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. నిఘా కొరకు ఏర్పాటు చేసిన సిసి కెమెరాలతో ఈ యాప్ను అనుసంధానం చేయడం వలన దొంగతనాలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇంటి పరిసరాలలోకి ప్రవేసించిన వెంటనే పోలీసు కంట్రోల్ రూంకు సమాచారం చేరవేస్తూ, అలారం మ్రోగుతుందన్నారు. దీనితో పోలీసులు అప్రమత్తమై, సంబంధిత పోలీసు స్టేషనుకు సమాచారం అందించి, దొంగతనాలు జరగకుండా సులువుగా నియంత్రించడంతో పాటు, నిందితులను కూడా రెడ్ హ్యాండడ్గా పట్టుకోవచ్చునన్నారు.

## శ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దా పురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీమరి డమ్మ అమ్మవారిని దర్శనమునకు గూడూరి.హర్షవర్ధన్ ఇమంది.సాయి సౌజ న్య ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సోమవారం దర్శించుకున్నారు. వీరికి దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ కే. విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు దేవస్తానం తరుపున దర్శనం, ఆశీర్వచనం చేయించి తీర్థ ప్రసాదములు అందజేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది వెంకట రమణ, వేద పండితులు, పాల్గొన్నారు

## గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఈరంకి ప్రభాకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులు, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయం అనుకూలంగా గ్రంథాలయానికి వచ్చి మార్గ నిర్దేశం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. తదుపరి కోటపాడు ప్రధానోపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు పిల్లల్ని ఉద్దేశించి స్పోకెన్ ఇంగ్లీష్ బోధించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రథమ శ్రేణి గ్రంథాల అధికారి పాలంకి నాగరాజు గారు సింగం బుల్లయ్య మరియు పాఠకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా అంతరాయం



పెరవలి, మేజర్ న్యూస్ : ఏప్రిల్ 29వ తేదీ మంగళ వారం ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 33 కెవి/11 కె.వి పెరవలి మండలం మల్లేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి లో కల మల్లేశ్వరం , కడింపాడు ఫీడర్ల యందు ఆర్ డి ఎస్ ఎస్ పనుల నిమిత్తం మల్లేశ్వరం ,పిట్టలవేమవరం, కడింపాడు గ్రామములకు సంబంధించి గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగును.మరియు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 04:00 గం నుండి 06:00 గం, వరకు మరియు మధ్యాహ్నం 12:00 గం నుండి సాయంకాలం 06:00 గంటల వరుకు ఇవ్వబడును.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు కోరారు.

## బాలకృష్ణకు ఎంపీ సానా సతీష్ బాబు అభినందనలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నందమూరి బాలకృష్ణకి పద్మభూషణ్ పురస్కారం నేడు అందుకున్న సందర్భంగా, నిన్న ఢిల్లీలో విశాఖపట్నం ఎంపీ మత్తుకుమిల్లి శ్రీభరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సానా సతీష్ బాబు మాట్లాడుతూ సినీ రంగంలో 50 సంవత్సరాలు పైగా, 110కు మించి చిత్రాలలో నటి స్తూ తన అసాధారణ నటనా ప్రతిభ, ఆకట్టుకునే వ్యక్తిత్వంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న మా బాలకృష్ణ సినిమా రంగానికి మాత్రమే కాకుండా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా పేదలకు, అవసరమైన వారికి అందించిన సేవలు అపూర్వమైనవి అని కొనియాడారు.

# ఐటిడిఏ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** స్థానిక ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ ఈ వారం వివిధ సమస్యలపై సుమారు 50 వినతులు రావడం జరిగిందని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను పివో ఆదేశించారు. గంగవరం మండలం మోహనాపురం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుమారు 60 మంది గిరిజనులకు ఒక వాటర్ ట్యాంక్, మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా 25 మంది పిల్లలకు ఒక స్కూలు ఏర్పాటు చేయాలని, తమ గ్రామంలో 5 వీధులకు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కురుసం సత్యనారాయణ, కురుసం సూరిబాబు, గంగల సూరిబాబు వినతిపత్రాన్ని సమర్పించారు. రాజవొమ్మంగి మండలం కింద్ర జంక్షన్ నుండి డి.మల్లవరం గ్రామం వరకు 2 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో ఆపివేయడం జరిగిందని, వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి రోడ్డు పూర్తి చేయాలని ఆర్. రామరాజు, కె.అచ్చిరాజు, యస్. రాజు వినతి పత్రం సమర్పించారు. రాజవొమ్మంగి మండలం లాగరాయి గ్రామంలో నాటు కోళ్ల ఫారం, డైరీ ఫారం కు సంబంధించిన గేదెలు, డైరీ ఫారం ఏర్పాటు చేసుకొనుటకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని కె కొలంబస్ వినతి పత్రం సమర్పించారు. రాజవొమ్మంగి మండలం కింద్ర గ్రామంలో వ్యవసాయ బోరు ఏర్పాటు చేయాలని దాసరి మార్కు విజ్ఞప్తి చేశారు. గంగవరం మండలం మొల్లేరు పంచాయతీ పరిధిలోని బి.శివరామపట్నంలో గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇండ్లు మంజూరు చేయాలని మడకం సావిత్రి, కె.శివశంకర ప్రసాద్, కుంజం వెంకటలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. ఇంకా పలు సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. గ్రీవెన్స్ లో వికలాంగ మహిళతో ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం. రుక్మాండయ్య, రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, డిఎల్‌డిఓ కోటేశ్వరరావు, డాక్టర్ రతన్, తాసిల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఈవోపిఆర్డి పద్మ, సిడిపిఓ సంధ్యారాణి, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏ సిహెచ్.కె.వి.చౌదరి, వెలుగు ఏపిడి దేగలయ్య, ఏయంఓ విజయభాస్కర్, డిప్యూటీ తాసిల్దారు త్రిమూర్తులు, శ్రీధర్, వి. రవీంద్ర,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, సాయి సతీష్, సుబ్బారావు, మల్లికార్జున రావు,డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, పిఎఓ ఎల్.రాంబాబు, డిడి ఆఫీస్ సూపర్డెంట్ బి.కిషోర్ పాల్గొన్నారు.

# ఏజెన్సీలో సచివాలయాలు ద్వారా 250 సేవలు



**రంపచోడవరం,మేజర్‌న్యూస్:** ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని సచివాలయాలు ద్వారా 250 సేవలు ప్రజలు పొందవచ్చుని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజల చేతిలో మన ప్రభుత్వం మన మిత్ర యాప్ కరపత్రాలు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ, ఐటీడీఏ ఎపిఓ జనరల్ డి ఎన్ వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాండయ్య, డిఎల్ డిఓ కె.కోటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాలు పరిధిలోని గ్రామ సచివాలయాల్లో మన చేతిలో మన ప్రభుత్వం, అదేవిధంగా మనమిత్ర వాట్సాప్ ద్వారా 250 సేవలు ఉపయోగపడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్)కు సెల్ నెంబర్ 955230009కు హాయ్ అని చేసి సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు, చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ప్రజలకు అనుమానం వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, తాసిల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్. శ్రీనివాసరావు దొర, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, జిసిడి ఎం.పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

# టౌన్ హాల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** పెహల్గాం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ మెయిన్ రోడ్ లో ప్రత్యేక కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. తొలుత ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కమిటీ అధ్యక్షులు జి.సత్యనారాయణ మూర్తి (నానాజీ) కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య సంయుక్త ఆధ్వర్యంలో టౌన్ హాల్ నుండి మెయిన్ రోడ్డు, ఎల్ ఐ సి ప్రధాన కార్యాలయం మీదుగా కళామందిర్ మరియు రామాలయం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఉన్న జమ్మూ కాశ్మీర్ ద్వారా దేశంలో అలజడి సృష్టించాలన్న ఉగ్రవాదుల కుట్రలను సమర్ధవంతంగా ప్రధాని మోడీ నాయకత్వంలో ఎదుర్కోవడం జరుగుతుందని అన్నారు. దాయాది దేశమైన పాక్ కు సరైన గుణపాఠం చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం తప్పక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రపంచంలోనే శాంతికి మారుపేరైన భారతదేశ సహనాన్ని పరీక్షిస్తే ఉపేక్షించబోరని హెచ్చరించారు. సర్వమానవ మరియు మతాల స్నేహ సౌభ్రాతృత్వాలకు పెద్దపీట వేసిన భారతదేశాన్ని ఉగ్రవాద కుట్రలతో ఏమి చేయలేరని గతంలో జరిగిన అనేక యుద్ధాల ద్వారా సరైన గుణపాఠం చెప్పినప్పటికీ అస్థిర పరచడానికే తిరిగి ప్రయత్నం చేయడం శోచనీయ మని పున్నయ్య అన్నారు. ర్యాలీలో భారతమాతకి జై ,ఉగ్రవాదం నశించాలి అంటూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టౌన్ హాల్ కమిటీ ఉపాధ్యక్షులు జి.వి.రఘునాద్, సంయుక్త కార్యదర్శి వి.వి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, కోశాధికారి ఎమ్.సూర్యనారా యణరాజు, కార్యవర్గ సభ్యులు సుసర్ల సుబ్రహ్మణ్యం,బచ్చు శివ ప్రసాద్, ఎమ్.సత్య నారాయణ, బసవా ప్రసాద్, నెక్కంటి శ్రీనివాస్, పి.రామచంద్రరాజు, పి.సతీష్, వెత్సా ఆనంద్ ప్రభుతులు పాల్గొన్నారు.

## అప్సా రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్‌గా మద్దిపాటి




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) వైస్ ఛైర్మన్ గా అంకంపాలెం శివ శివాని ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ మద్దిపాటి నాగలక్ష్మి చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం అప్స రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడ సమీపంలోని కానూరు విధాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సుందర రామ్ అధ్యక్షతన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అప్స 40 సంవత్సరాలచరిత్రలో తొలిసారిగా ఏర్పడిన రాష్ట్ర అప్సా మహిళ విభాగంలో ఆత్రేయపురం మండలం అంకంపాలెం శివ శివాని హిందూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మద్దిపాటి నాగలక్ష్మి చైతన్య స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అప్స గౌరవ అధ్యక్షులు సుందర్ రామ్, ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్య రాజు ప్రమాణ స్వీకారం చేయించి, వారి చేతుల మీదుగా మేమేంటో అందించి ఆప్సా విభాగానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మద్దిపాటి నాగలక్ష్మి చైతన్య ప్రసాద్‌ని అభినందిస్తూ కరుటూరి నరసింహారావు, విశ్వేశ్వరి దంపతులు, కుదప కృష్ణమూర్తి, కరుటూరి వరప్రసాద్, కరుటూరి రఘునాథ్ చౌదరి, మండపేట జోనల్ సభ్యులు, స్కూల్ స్టాఫ్ అభినందనలు తెలిపారు.

## వెంకన్న హుండీ ఆదాయం రూ.1 కోటి 19 లక్షలు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 32 రోజుల కాలానికి రూ.1,19,16,439లు; బంగారం 13 గ్రాములు, వెండి 1 కేజీ 380 గ్రాములు, 64 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరాయి. అలాగే క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3,45,300లు సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్రావు, తనిఖీ అధికారి టీవీఎస్ ఆర్ ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, ఈవోలు బి.కిరణ్, బి.నరేంద్ర కుమార్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవున్ని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు



**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దంపతులు సన్నిధికి విచ్చేశారు. డిప్యూటీ స్పీకర్ దంపతులను ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారి వ్రతంను ఆచరించి అనంతరం శ్రీ స్వామి, అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అడిషనల్ కమిషనర్ సీహెచ్ రామమోహనరావు శాలువా కప్పి శ్రీ స్వామివారి ప్రసాదంను అందించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడిషనల్ కమిషనర్ సీహెచ్ రామమోహనరావు తో పాటు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లు దామోర్ల కృష్ణారావు, కోటగిరి వెంకట సత్య శేష రామకృష్ణ, ఏఈఓ కొండలరావు, దేవస్థానం అధికారులు, పురోహితులు, రిటైర్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాస్కర ప్రసాద్, బిజేపి నాయకులు చిరంజీవిరావు పాల్గొన్నారు.

# వాద్వానీ ఫౌండేషన్‌తో ఎంఓయుపై చర్చ





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం విసి కాన్ఫరెన్స్ హాలు నందు బెంగుళూరులోని వాద్వానీ ఫౌండేషన్ మరియు జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయాల మధ్య ఎంఓయుపై చర్చ జరిగింది. జెఎన్‌టియుకె నుండి ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్ ప్రొ.కెవి.రమణ, రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జి ప్రొ.వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావులు విచ్చేయగా వాద్వానీ ఫౌండేషన్ నుండి మూర్తి పాల్గొన్నారు. కార్యక్రమానికి జెఎన్‌టియుకె డైరెక్టర్ అకడమిక్ ప్లానింగ్ (డిఏపి) ప్రొ.బి.బాలకృష్ణ అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ జెఎన్‌టియుకె యూనివర్శిటీ 160 అనుబంధ కళాశాలల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ & మేనేజ్‌మెంట్ విభాగాలలో విద్యార్థులకు యుజి & పిజి కోర్సులను అందిస్తుందన్నారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రపంచీకరణకు అనుగుణంగా పరిశ్రమలకు అనుసంధానం చేస్తూ పాఠ్యాంశాలను రూపొందించడం ద్వారా విద్యార్థులను ఎంట్రప్రెన్యూర్స్‌గాను, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి తీర్చిదిద్దవచ్చునన్నారు. వాద్వానీ ఫౌండేషన్‌తో ఎంఓయు కుదుర్చుకోవడం ద్వారా తమ అధ్యాపకులు కస్టమైజ్డ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ల ద్వారా విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వం, వ్యాపార నైపుణ్యాలు, సాధికారత కలిగిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. ఇందులో భాగంగా వాద్వానీ ఫౌండేషన్ సహకారంతో వచ్చే విద్యా సంవత్సరం నుండి ఎంట్రప్రెన్యూర్‌షిప్, స్టార్టప్స్‌లలో అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్స్‌లో ఓపెన్ ఎలక్టివ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం లభిస్తుందన్నారు. వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి మూర్తి మాట్లాడుతూ జెఎన్‌టియుకె యూనివర్శిటీతో ఎంఓయు కుదుర్చుకోవడం ద్వారా అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా వారు విద్యార్థులకు 21వ శతాబ్ధపు నైపుణ్యాలైన సృజనాత్మకత, ఆవిష్కరణ, సంక్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనుట, విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పరిశోధన మరియు విశ్లేషణ, ఆర్థిక అక్షరాస్యత & నిర్వహణ, ప్రాజెక్ట్ ప్రణాళికలపై అవగాహన పెంపొందు తుందన్నారు. ప్రస్తుత తరుణంలో దేశంలో 75శాతం మందికి పట్టభద్ర విద్యార్థులకు వినూత్నమైన స్టార్టప్ ఐడియాలు ఉన్నాయని, కానీ వాటిని సాకారం చేసుకునేందుకు సరైన ప్రణాళిక లేకపోవడంతో వెనకడుగు వేస్తున్నారన్నారు. దీన్ని అధిగమించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా ముందుగా అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి తద్వారా విద్యార్థులకు సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మరియు యూనివర్శిటీ అధికారులు వాద్వానీ ఫౌండేషన్‌తో ఎంఓయు కుదుర్చుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్రీయ ఫిజియోస్ క్రికెట్ పోటీల్లో కిమ్స్ ఫీజియోథెరపీ విద్యార్థులు విజయం




**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల 24 వ తేదీ నుండి 26వ తేదీ వరకు విశాఖపట్టణం వి.ఏ.ఎం.పి.ఎస్. ఫీజియోథెరపీ కాలేజీలో "క్రికెట్ యూనియన్ ఆఫ్ ఫిజియోస్" నిర్వహించిన ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌లో కిమ్స్ ఫీజియోథెరపీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో ఆడి రన్నర్స్ ట్రోఫీ మరియు నగదు బహుమతి గెలుచుకున్నారని ఫీజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.అశోక్ చక్రవర్తి తెలిపారు. ట్రోఫీ మరియు 12,500 రూపాయల నగదు బహుమతిని డా.ఎం.టి.ఆర్. యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డా.వేమిరెడ్డి రాధికా రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. చదువుతో పాటు ఆటలలో కూడా తమ ప్రతిభను చాటిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ డా. అశోక్ చక్రవర్తిని మరియు ఫిజికల్ డైరెక్టర్ నాగరాజును కిమ్స్ చైర్మన్ కె.కె.వి.వి.సత్యనారాయణ రాజు, ఎం.డి. రవి కిరణ్ వర్మ, కిమ్స్ డీన్ డా. ఆనంద్ ఆచార్య అభినందించారు.

## అలవాల తపస్వి చికిత్స నిమిత్తం జమలాఖాన్ 10,000 ఆర్థికసాయం



ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ ఎటపాక మండలం గ్రామంలో అలవాల అంబేద్కర్ అనే వ్యక్తి పాలిటెక్నిక్ కళాశాలలో రోజువారి అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గత సంవత్సరం 2024 డిసెంబర్ 21 తేదీన మణుగూరులో తన కుమార్తె అలవాల తపస్వి (12) ప్రమాదవశాత్తు బైక్ ప్రమాదం సంభవించడంతో మెదడులో రక్తం గడ్డ కట్టడం జరిగింది. చికిత్స నిమిత్తం విజయవాడ రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో అప్పటినుండి చికిత్సలు చేస్తూ మందులు వాడుతున్నారు. సుమారుగా ఇప్పటి వరకు నాలుగు లక్షల వరకు తనకు తాహతుకు మించి కూతురు కొరకు ఖర్చు చేయడం జరిగింది. అలవాల అంబేద్కర్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకె సిట్ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ సోమవారం వెళ్లి బాధితులను పరామర్శించి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకొని, మందులకు తన వంతు సహాయంగా పదివేల రూపాయలను అలవాల అంబేద్కర్‌కు అందజేయడం జరిగింది. ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడంతో పాటు ధైర్యాన్ని కూడా చెప్పి జీవితంపై మంచి ఓదార్పును ఇవ్వాలని, కష్టాల్లో ఉన్నవారికి తమకున్న దాని నుండి ఎంతో కొంత సహాయం చేసి కూలిపోతున్న కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా జమాల్ ఖాన్ తెలిపారు.

## జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధికార ప్రతినిధిగా సుదా గణపతి



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అమలాపురానికి చెందిన సుదా గణపతిని నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. గణపతి గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో అనేక పదవులు చేపట్టారు. ఈయన నియామకం పట్ల వైఎస్ఆర్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేసారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

**– కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి ఎంతో నమ్మకంతో వచ్చే అర్జీదారుల సమస్యలను తమ సొంత సమస్యలుగా భావించి పరిష్కరిస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఓ రాజకుమారి, డ్వామా, డిఆర్డిఏ పిడీలు, ఎస్ మధుసూదన్ జయచంద్ర గాంధీ, ఎస్‌డిసి కృష్ణమూర్తిలు సుమా రుగా 233 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పరిష్కారాలను చూపాలని ఏ ఒక్క అర్జీని సరైన కారణాలు చూపకుండా పరిష్కరించినట్లు ఎండార్స్మెంట్ చేయరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అర్జీదారుల సమక్షంలో విచారిస్తూ ఆమోదయోగ్యంగా సంతృప్తే కొలమానంగా పరిష్కరించాలన్నారు. ఉన్నతాధికారులు సిఫార్సు చేసిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అధికారులు కృషి సల్పాలన్నారు. ఒకే అంశంపై అర్జీలు పునరావృతం కాకుండా గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మీకోసం వెబ్సైట్లో అర్జీదారులు తమ సమస్యలను నమోదు చేసుకుని వచ్చునని నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతులను తెలుసుకోవాలనుకున్నప్పుడు 1100 టోల్ ఫ్రీ నెంబర్కు కాల్ చేసి తెలుసుకొని వచ్చునన్నారు. అర్జీలను మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యత ప్రమాణాలతో అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా ప్రతి అధికారి పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కుల ధ్రువీకరణ సమస్యలు పరిష్కారం

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**



**రంపచోడవరం,మేజర్ న్యూస్ :** డిఎల్ఎస్‌సిలో పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ సమస్యలు పరిష్కారానికి ఈనెల 30వ తేదీన డిఎస్సీ అభ్యర్థులు రావాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సోమవారం విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ2025 నోటిఫికేషన్ ను పురస్క రించుకొని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి దృష్టికి వచ్చిన కుల ధ్రువీకరణ అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రంపచోడవరం ఏజెన్సీ డివిజన్ పరిధిలో ఉన్న ఏడు మండలాలకు చెందిన గిరిజన యువతీ యువకుల్లో డిఎస్సీ 2025 కు దరఖాస్తు చేసుకోదలిచిన అభ్యర్థులు మాత్రమే రావాలని కోరారు.

కుల ధ్రువీకరణకు సంబంధించి కేసులు డిఎల్ఎస్‌సిలో పెండింగ్ ఉన్నవారు ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో హాజరు కావాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం విజ్ఞప్తి చేశారు.

కేసులు పెండింగ్ ఉన్న అభ్యర్థుల కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలియ జేశారు. తద్వారా గిరిజన అభ్యర్థులు డిఎస్సీకు అప్లై చేసుకోడానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఐటీడీఏ పిఓ సింహాచలం పేర్కొన్నారు.

# ఇరిగేషన్ స్థలాల కబ్జాలపై మండల సమావేశంలో వాడి వేడి చర్చ




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఇరిగేషన్ స్థలాలు కాలువ గట్లు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని ఎంపీడీవో వెంకట్ రామన్ తాసిల్దార్ టి.రాజేశ్వరరావు అన్నారు. సోమవారం ఆత్రేయపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు వాడపల్లి వెంకన్న ఆలయానికి వస్తున్న భక్తులు ఇరిగేషన్ స్థలాల ఆక్రమణకు గురి కావడంతో ట్రాఫిక్ రద్దీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల పరిధిలో ఇరిగేషన్ స్థలాలు కబ్జా కాకుండా గ్రామ వీఆర్ఓ కార్యదర్శి నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. స్థలాలు ఆక్రమణ గురవుతున్న సమయంలోనే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణలు నియంత్రించాలని అందుకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. సమావేశంలో రబీ సీజన్లో రైతులు ధాన్యం అధిక దిగుబడి సాధించారని, అందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయడంలో వ్యవసాయ అధికారులు విఫలం అవుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల వ్యవసాయ అధికారి భార్గవ మహేష్ సమాధానమిస్తూ మండలంలో సుమారు పదివేల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5400 మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలుకు అనుమతులు లభించాయని అన్నారు. మరో ఐదు వేల మెట్రిక్ కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపడతామని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులంతా మంచినీటి సమస్యలు లేకుండా చూడాలని సభ దృష్టికి తీసుకు వచ్చారు. జెడ్పిటిసి బోనం సాయిబాబా మాట్లాడుతూ లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం గ్రామాలకు చెందిన పంట పొలాల ముంపు సమస్య పరిష్కారం కొరకు చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో ర్యాలి పంట పొలాలు ముంపు బారిన పడకుండా పనులు చేపట్టాలని డ్రైనేజీ అధికారులకు సూచించారు. సమావేశంలో విద్య వైద్యం త్రాగునీరు ఉపాధి హామీ విద్యుత్ సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల చెందిన అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కిషోర్ వికాసంపై బాలికలకు అవగాహన కల్పించాలి

**- సిడిపిఓ పూర్ణిమ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కిషోర్ వికాసంపై బాలికలకు అవగాహన కల్పించాలని జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి పూర్ణిమ అన్నారు. కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శివ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఓ పూర్ణిమ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు వయస్సు బాలికలకు కిషోర్ వికాసం పై అవగాహన కల్పించాలని అన్నారు.. ముఖ్యంగా అక్షయ తృతీయ పురస్కరించుకుని 18 సం. వయసు పూర్తికాని ఆడపిల్లలకు వివాహములు చేసేందుకు పెద్దలు ప్రయత్నిస్తుంటారని అటువంటి వివాహాలు జరగకుండా ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యము, పోషకాహారము, సంరక్షణ, తదితర అంశములపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు గాను గ్రామస్థాయిలో కమిటీ ఉంటుందని. ఈ కమిటీ లో మహిళా పోలీసు కన్వీనర్ గాను అంగన్వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ లు కమిటీగా ఉంటారని వారు గ్రామాలలో మే రెండవ తేదీ నాటికి సెలవుల్లో ఉన్న బాలికలను, బడి బయట ఉన్న బాలికలను జతపరిచి గ్రూపుఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలోని కిర్లంపూడి మండలం బూరుగుపూడి, జగ్గంపేట గ్రామాలలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## తీపర్రు శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ప్రారంభం



పెరవలి, మేజర్ న్యూస్ : తీపర్రు శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వ్యవస్థాపకులు పత్తిపాటి ప్రసాద్ గ్రామ పెద్దలు నందమూరి నారాయణరావు మరియు రిసోర్స్ పర్సన్స్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో రిసోర్స్ పర్సన్స్ పి భార్గవి ,ఎన్ పోసిబాబు ,ఎండి ప్రియాంక లు కథలు చదివించి స్పోకెన్ ఇంగ్లీష్ మరియు జనరల్ నాలెడ్జిపై చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో 22 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. గ్రంథాలయ అధికారిని సిహెచ్ వి జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేసిన అధ్యక్షుడు సురేష్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** గత నెల రోజులుగా జగ్గంపేటలో వాకర్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో గోకవరం రోడ్ పెన్షనర్ల భవనం వద్ద ప్రతి సోమవారం మజ్జిగను వాహనదారులకు, రిక్షా కార్మికులకు, బాటసారులకు క్లబ్ అధ్యక్షుడు ముమ్మిడివరపు సురేష్ ప్రారంభించారు.. ఎలెక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ, మాజీ గవర్నర్ కొత్త కొండబాబు మాజీ ఆర్సి సమ్మెట సాయి రామ్, జెడ్సి వెత్సా నాగ సత్య, కార్యదర్శి మానేపల్లి సతీష్, సీనియర్ వాకర్స్ చంద్రమౌళి వెంకట శాస్త్రి, మంచాల మల్లేశ్వరరావు, దామెర్ల భాస్కరరావు, కొత్త నాగ పండు అధిక మొత్తంలో వాకర్స్ పాల్గొన్నారు.

## సూరంపాలెం బాలును పరామర్శించిన జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్



**గండేపల్లి,మేజర్న్యూస్ :** సూరంపాలెం గ్రామంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సూరంపాలెం బాలు అక్క ఇటీవల స్వర్గస్తులైనారు. వారి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంచే కోటి, నల్లల శివ, కుంచే రామకృష్ణ, కుంచే పెదబాబు, అల్లం శ్రీనివాస్, ప్రగాదరెడ్డి వీరబాబు, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, కాయల మణికంఠ, గుంట ముక్కల చిన్న, కోలమూరు బుజ్జి, రాయుడు ఇతరులు పాల్గొన్నారు.

# నిడదవోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మే 3న జాబ్ మేళా

**- పాల్గొననున్న 45 కంపెనీలు**
**- 1302 మందికి ఉద్యోగాల కల్పన**
**- రూ.12,000 నుండి రూ.40,000 వరకు జీతం పొందే సువర్ణావకాశం**
**- నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని**
**మంత్రి కందుల దుర్గేష్ పిలుపు**



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడం కోసం మే 3వ తేదీన ఎస్ వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో భాగంగా 1302 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా రూ.12,000 నుండి రూ.40,000 వరకు జీతం పొందవచ్చన్నారు. జాబ్ మేళాకు ఇసుజూ, ఎల్ అండ్ టీ కన్ స్ట్రక్షన్, జీఎంఆర్ కార్గో, పానాసోనిక్,హెచ్ డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, అపోలో ఫార్మసీ, ఐసోన్ ఎక్స్ పీరియన్సెస్, స్మార్ట్ బ్రెయిన్స్, సాండ్ స్పేస్ టెక్నాలజీస్, డీలెట్ కర్ కార్పొరేట్, సదర్ ల్యాండ్, సినర్జీస్, ఈఎస్ఏఎఫ్, స్వం దన, ముత్తూట్ ఫైనాన్స్, పైసా బజార్, రీసొల్యూట్, ఇండస్, ఎంసీవీ, ఇండో ఎంఐఎం, పిల్కింగ్టన్,ఇన్ ఫిలూమ్, హెచ్ డీఎఫ్ సీ, బీఎస్ సీపీఎల్, జీవీఆర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర 45 కంపెనీల ప్రతి నిధులు రానున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పాసై మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్న యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 35 ఏళ్లలోపు ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడెటా, విద్యార్హత, సర్టిఫికెట్లతో మే3వ తేదీన ఉదయం 9 గంటల నుండి నిర్వహించే జాబ్ మేళాకు హాజరుకావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.

## తప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 అర్జీలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 5 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు.ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డివిజ్పిటిఓ కార్యాలయ ఏఓ మైథిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివిజన్లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలు స్ఫూర్తి నింపారు

**– క్రీడల్లో, చదువుల్లో వారి ప్రతిభ అసమాన్యం**

**– కలెక్టర్ ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాసిన ప్రత్యేక అవసరాలు కలిగిన 126 మంది ఉత్తీర్ణత సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అభినందించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కలెక్టర్ అభినందించడం జరిగి ంది. ఈ సందర్భంగా కలెక్టర్ ను కలిసిన వారిలో సర్వ శిక్ష అభియాన్ ఎస్ సుభాషిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలలో 126 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 88.86% ఉత్తీర్ణత సాధించడం స్ఫూర్తి కలిగిస్తోందని అన్నారు. వీరిలో ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిచిన రాజమండ్రి రూరల్ మండలానికి సంబంధించి సాటిలైట్ సిటీ పాఠశాల విద్యార్థి చిరంజీవి శివశంకర్, రాజమండ్రి అర్బన్ మండలానికి చెందిన నవ్య శ్రీ, తాళ్లపూడి అన్నదేవర పేట కు ఆకుల లావణ్య లక్ష్మి, తదితరులను అభినందించి భవిష్యత్తులో మరింత బాగా రాణించాలని అభిలాషించారు. ఇదే సమయంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ప్రత్యేక అవసరాలు కలిగిన ఆటల పోటీ నందు తూర్పుగోదావరి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారన్నారు. సోను ప్రదీప్ రాజమండ్రి రూరల్ ధవలేశ్వరం భవిత కేంద్రం చెందిన విద్యార్థి బేస్ బాల్ నందు రాష్ట్ర స్థాయి బంగారు పతకాన్నీ సాధించారనీ, గంధం అర్జున్ , ఆర్ జోషి , కే శకుంతల, ఎం అభి లు 100 మీటర్లు, 50 మీటర్లు వివిధ విభాగాల నందు ద్వితీయ స్తానన్నీ పొంది రజిత పథకాన్ని సాధించారన్నారు. సాయి షణ్ముఖ పరుగు పందెంలో తృతీయ స్థానాన్ని పొంది కాంస్య పతకాన్ని సాధించారనీ కలెక్టర్ తెలిపారు. జిల్లా నుండి పాల్గొన్న ఆరుగురు విద్యార్థులు 6 పతకాలు సాధించి రాష్ట్రస్థాయిలో మన జిల్లాని ముందు వరసలో ఉంచడం పట్ల వారిలోని ప్రతిభను గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రత్యేక అభినందలు తెలియ జేయడం జరిగింది.జిల్లాలో ప్రత్యేక అవసరాలు కల 145 మంది విద్యార్థులలో 126 మంది ఉత్తీర్ణులై 86. 89 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎస్ ఎస్ ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ సుభాషిణి తెలిపారు. నలుగురు విద్యార్థులు హాజరు కాలేదన్నారు.

# నడుపల్లి గ్రామంలో ఇంటింటికి కుళాయి నీళ్లు ప్రారంభం

**పెరవలి, మేజర్ న్యూస్ :** నడుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జల జీవన మిషన్ లో భాగముగా 65 లక్షల వ్యయంతో నిడదవోలు శాసనసభ్యులు మరియు సాంస్కృతిక పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రివర్యులైన కందుల దుర్గేష్ ఆదేశాలతో ఆర్డబ్ల్యూఎస్ డీఈ టి శ్రీనివాస్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ఎస్.సాయికుమార్ గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు పర్యవేక్షణలో వాటర్ ట్యాంక్ నిర్మాణము మరియు పైప్ లైన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయటం జరిగినది. వేసవికాలం దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో ఏప్రిల్ 28వ తేదీ సోమవారం నడిపల్లి గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు క్రొత్త పైప్ లైన్లకు నీటిని విడుదల చేయటం జరిగినది.ఈ కార్యక్రమంలో, గ్రామపంచాయతీ సెక్రెటరీ షరీఫ్,ఇంజనీరింగ్ అసిస్టెంట్ త్రిమూర్తులు, పంచాయతీ సిబ్బంది శివ,రాజు పాల్గొన్నారు క్రొత్త పైప్ లైన్ ద్వారా కొళాయి నీళ్ళు రావడం



తో గ్రామంలోని ప్రజలు మంత్రి కందుల దుర్గేష్ కు గ్రామ సర్పంచ్‌కి, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పద్మశ్రీ అవార్డు అందుకున్న బుర్రకథ కళాకారుడు కుటుంబ సభ్యులు



రావులపాలెం, మేజర్ న్యూస్ : ఆయన ధ్యాస ఆయన శ్వాస ఆయన ఆశ చివరి నిమిషం వరకు కలపట్ల ఆయనకున్న నమ్మకం దానికోసమే బ్రతకాదు బుర్రకథకు జీవం పోసాడు చివరకు దశదిన కర్మ రోజున దేశ అత్యున్నత పుష్కారం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక అయ్యాడు ఆయనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నడుకుదురుకు చెందిన, ప్రస్తుత నివాసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం చెందిన చెందిన బుర్రకథ కళాకారుడు స్వర్గీయ మిరియాల అప్పారావు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో జరిగిన పద్మశ్రీ అవార్డుల ప్రధానోత్సవం లో స్వర్గీయ అప్పారావు కుమార్తె మిరియాల శిరీష పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి ముర్ము ద్రౌపది చేతులు మీదుగా అందుకున్నారు.మట్టిలో మాణిక్యాలాంటి వారికి పద్మ పురస్కారాలు అందిస్తోంది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం. ఈ ఏడాది 30మంది ఈ విధంగా ఎంపికైనవారు ఉండటం సంతోషాన్ని కలిగించింది.

మన రాష్ట్రానికి చెందిన బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు మరణానంతరం పద్మశ్రీకి ఎంపికయ్యారు. వారి కళా సేవకు తగిన గుర్తింపు దక్కింది అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు.

దేశంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది.రాష్ట్రపతి సుమారుగా 139 అవార్డుల కోసం ప్రముఖులను ఎంపిక చేసింది. వారిలో 7 గురిని పద్మ విభూషణ్, 19 మంది పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ అవార్డుల కోసం ఎంపిక చేశారు. ఈ సంవత్సరం ఎంపిక చేసిన వారిలో 23 మంది మహిళలు ఉన్నారు.

## చేయూత ఆధ్వర్యంలో 30 నుండి ప్రత్యేక తరగతులు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు కోసం చేయూత ఆధ్వర్యంలో 30వ తారీఖు నుండి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు చేయూత స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ టూ టౌన్ సమీపాన ఉన్న రోటరీ చేయూత భవన్‌లో ఈ ప్రత్యేక తరగతులను 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు ప్రతిరోజు ఉచితంగా నిర్వహించడం జరుగుతు ందన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం వృధా కాకూడదన్నద ృక్పథంతో ఉన్నత విద్యకు వారందరూ ఎంపికవ్వాలన్నా సదాశ యంతో ఈ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. తమ సంస్థలో సభ్యులుగా ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత ఈ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని డాక్టర్ రవి తెలిపారు. ఈ ఉపాధ్యాయ బృందంలో రవి శంకర్, వాణి ప్రభ, ఎస్.కె.వి.భాష, చింత నారాయణ మూర్తి, శ్రీనివాస్, అలీమ్, కె.తేజస్వి తోపాటు మరి కొంతమంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు. ఉచితంగా నిర్వహిస్తున్న తరగతులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డాక్టర్ రవి విజ్ఞప్తి చేశారు. 8639727476లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోవాలి

**– ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్:** ప్రభుత్వ సంక్షేమం పథకాలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరని ఎంపీడీవో యాద గిరి ఈశ్వరరావు అన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో లేని వాళ్ళు, హౌస్ హోల్డ్ మ్యాపిం గ్‌లో వుండి ఈ కేవైసీ పూర్తి కానీ వాళ్ళకు ప్రభుత్వం ద్వారా అందే సర్వీసులు, పథకాలు పొందడానికి అరువులు కారని, ప్రజలు అందరూ ఈ విషయాన్ని గమనించి తక్షణమే మీ సమీపంలో ఉండే సచివాలయంకి వెళ్ళి మ్యాపింగ్ చేయించు కోవాలని ఇప్పటికే మ్యా పింగ్‌లో ఉన్నట్లైతే ఈ కేవైసీ చేయించుకోవాలని ఆయన తెలి పారు. ఏసచివాలయ ఉద్యోగి లాగిన్‌లో చేయించుకోవచ్చు అన్నారు.

## టిడ్కో లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది

**– బ్యాంకు రుణాలు అందించి లబ్ధిదారులను ఆదుకోవాలి**

**– పిఠాపురం టిడిపి మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ అన్నపూర్ణ**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** టిడ్కో ప్లాట్లు కేటాయింపు విషయంలో లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, సరిచేసి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి లబ్ధిదారులను ఆదుకోవాలని పిఠాపురం నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు, 18 వార్డ్ కౌన్సిలర్ అన్నపూర్ణ అధికారులను కోరారు. బాధితులతో కలిసి సోమవారం పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణికి వినతిపత్రం అందజేశారు. పిఠాపురంలో సుమారు 200 మంది టిడ్కో లబ్ధిదారులు డబ్బులు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు వారికి ఫ్లాట్ల కేటాయింపు జరగలేదన్నారు. సిబిల్ స్కోర్ నెపంతో లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, తద్వారా వారు ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడీ రుణాన్ని కోల్పోతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే 10 ఏళ్ళు సమయం గడిచినప్పటికీ టిడ్కో ఫ్లాట్లు అందించకపోవడం బాధాకరమన్నారు. సిబిల్ స్కోరు బాగోలేదన్న కారణాన్ని ఎక్కువగా చూపుతున్నారని, కార్యాయలం నుండి ప్లాటు కేటాయింపు విషయంలో నోటీసులు జారీ చేసియున్నారని, తదుపరి లబ్ధిదారులు తాము రూ. లక్ష చెల్లించినప్పటికీ నేటికి తమకు ఫలితం లేదని వాపోతున్నారని, ఒకపక్క బ్యాంకులు రుణాలు ఇవ్వక, మరోపక్క వీరికి అధికారులు ప్లాట్లు అప్పగించకపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇంట్లో ఎవరో ఒకరి పేరుగాని, నామిని పేరుగాని, మార్ట్‌గేజ్ లోన్ ఇవ్వడానికి ఎటువంటి నిబంధనలు విధించకుండా అన్ సెక్యూర్డ్ రుణంగాని ఇవ్వాలని కోరుతున్నామ న్నారు. టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ , జిల్లా కలెక్టర్ ఈ అంశంపై దృష్టి సారించి బాధితులను ఆదుకోవాలని అన్నపూర్ణ కోరారు.

# సూట్ కేస్ కంపెనీకి ఎకరా 99 పైసలకే కేటాయింపు

– మంత్రి సుభాష్ చెప్పాలి

– జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ జగన్ లండన్ వెళ్లిన ప్రతిసారి అక్కడ హాస్పిటల్లో మతిస్థిమితానికి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని విమర్శించారని, ఎకరా 99 పైసలకి పేరు లేని కంపెనీకి కట్టబెట్టడం మతి ఉండి చేసిన పనేనా అంటూ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ప్రశ్నించారు. సద్విమర్శ చేస్తే తీసుకుంటాను అన్న సుభాష్ మీ సామాజిక వర్గానికి చెందిన 50 సంవత్సరాలు పైబడిన వారందరికీ పించను ఇస్తానని చెప్పి 11 నెలలు గడుస్తున్నప్పటికీ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికే అమరావతి రాజధానికి 58 వేల ఎకరాలు భూమి సేకరించి తాత్కాలిక సచివాలయం మాత్రమే కట్టి, ఇప్పుడు మరొక 44,000 ఎకరాలు సేకరిస్తాను రాజధాని అని చెప్పడం మతి ఉండి చేసిన పనా లేక మతి లేని పనా ఆలోచించాలని మంత్రికి హితవు పలికారు. అమరావతిలో తాత్కాలిక సచివాలయానికి రూ.1100 కోట్లు ఖర్చు పెడితే, తెలంగాణలో రూ.613 కోట్లతో అంతకంటే గొప్ప సచివాలయం నిర్మాణం అయ్యిందన్నారు. ఇప్పుడు మళ్ళీ సచివాల యానికి 4 వేల కోట్లు పైబడి కేటాయించి కొత్త భవనం నిర్మిస్తానని చెప్పడం ఎవరి జేబులు నింపడానికంటూ ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారు ఏం తెచ్చాదని అడుగుతున్నారని, ఏం చేశారో ఎంత అభివృద్ధి చేశారో రాష్ట్ర ప్రజలందరూ చూశారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కొత్త పెన్షన్లు ఆరు నెలలకు ఒకసారి కొత్తవారికి ప్రతి ఒక్కరికి ఇచ్చేవారని ఈ ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్న ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు ఏమీ పెంచను అని చెప్పి ఇప్పుడు పన్నులు రూపేనా వెన్నుపోటు పొడుస్తున్నాడని, మందు రేట్లు పెంచడం, కరెంట్ బిల్లులు పెంచడం, పన్నులు విపరీతంగా పెంచడం ఇవన్నీ కూడా మతిలేని పనులుగా పరిగణించి ఇప్పటికైనా సరిచేయించుడానికి పిచ్చాస్పత్రిలో చేర్పించా లంటూ ఘాటుగా విమర్శించారు. ప్రశ్నిస్తా అని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ పై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. అన్నిటిలో నేనున్నానంటూ ముందుగా పవన్ కళ్యాణ్ సూట్ కేస్ కంపెనీకి 99 పైసలకే ఎకరా ఇచ్చినప్పుడు ఎక్కడికి పోయావు నువ్వు ప్రశ్నించకుండా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రేట్లు పెంచను అని చెప్పి అనేక వాగ్దానాలు ఇచ్చి వాగ్దానాలను నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబునాయుడుని ఎందుకు ప్రశ్నించవు పవన్ కళ్యాణ్, స్టీల్ ప్లాంట్ అమ్మేస్తుంటే ఎక్కడున్నావంటూ ఆయన పవన్ను ప్రశ్నంచారు. జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇస్తే ఎక్కడ ప్రశ్నిస్తారని నోరు నొక్కేయడానికి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారని ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డికి టైం ఎక్కువ సమయం ఇవ్వాల్సి వస్తుందని అప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకుండా ఉన్న చంద్రబాబు మోసాలన్నీ బయట పెడతారని భయంతోనే జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, అంతా ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా సక్రమమైన పరిపాలన ప్రజలకు అందించండి తప్పు చౌకబారు ఆరోపణలతో ప్రజలను మోసం చేయకండి అని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో కొత్తపేట ఎంపీపీ గంగాధర్, మాజీ జిల్లా ప్రతిపక్ష నేత శాఖ ప్రసన్నకుమార్, కన్వీనర్లు తమన్న శ్రీనివాస్, కర్రి నాగిరెడ్డి, జవ్వాది రవి, కర్రి అశోక్ రెడ్డి, గొలుగూరు మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి పనుల పునరుద్ధరణ సభను విజయవంతం చేయండి

– ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఈనెల రెండవ తేదీన రాజధానిలో జరగనున్న అమరావతి పనుల పునరుద్ధరణ ప్రారంభ మరియు ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నిమిత్తం దెందులూరు నియోజకవర్గ అబ్జర్వర్ గా నియమితులైన ఎమ్మెల్యే సత్యానందరావు స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు తో కలసి ఆయన కార్యాలయంలో కూటమి నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ఆంధ్రుల రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఇందుకోసం తెలుగుదేశం, జనసేన, భాజపా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే సత్యానం దరావు సూచించానని ఒక ప్రకటనలో తెలిపారు.

## పెరవలి మండల టిడిపి అధ్యక్షుడిగా అతికాల వెంకటరామ కృష్ణమ్మ (శ్రీను) ఏకగ్రీవ ఎన్నిక





**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షు డిగా ఖండవల్లి గ్రామానికి చెందిన అతికాల వెంకటరామ కృష్ణమ్మ (శ్రీను) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 27వ తేదీ వేలివెన్ను గ్రామ ంలో జరిగిన నిడదవోలు నియోజకవర్గ స్థాయి తేదేపా సమావేశంలో తెలుగుదేశం పార్టీ పెరవలి మండల పార్టీ అధ్యక్షులుగా వరుసగా రెండవసారి అతికాల వెంకట రామకృష్ణమ్మ (శ్రీను) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు ఆదేశాలతో పెరవలి మండల శాఖ అధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ అధ్యక్షతన ఏప్రిల్ 28వ తేదీ సోమవారం కానూరు గ్రామంలో కానూరు, నడుపల్లి, కానూరుఅగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, గ్రామాల నాయకులు సమావేశమై ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల అధ్యక్ష కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

– విద్యార్థులకు లైబ్రేరియన్ ఎం శ్రీదేవి హితవు



**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** విద్యార్థులు గ్రంథాలయాలలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ముదినేపల్లి గ్రేడ్ 3 శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం శ్రీదేవి అన్నారు. ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు ఉదయం 8 నుండి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తామ న్నారు. ఈ శిబిరాలలో పుస్తకపఠనం , పుస్తకసమీక్షలు ,కథలు చదివించడం , డ్రాయింగ్ ,క్రాఫ్టవర్క్,డ్యాన్స్,యోగ ,ఆటలు , పాటలు , మేధావులు ,స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలు విద్యార్థులకు నేర్పిస్తామన్నారు. వీటిలో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సముద్రపు నాచు సాగు వల్ల బహుళ ప్రయోజనాలు

– కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లాలో సముద్ర తీరం వెంబడి జీవనోపాధికి మద్దతునిచ్చే చెరువు ఆధారిత సముద్రపు నాచు సాగు వల్ల బహుళ ప్రయోజనాలు ఉండ దంతో పాటుగా సహజ పర్యావరణానికి దగ్గరగా లాభదాయకంగా ఉంటుందని ఆ దిశగా నాచు సాగుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా స్థాయి అధికారులు కాలుష్య నియంత్రణ మండలి డిఆర్డిఏ, ఎల్డిఎం అధికారులతో సమావేశం నిర్వహించి చెరువు ఆధారిత సముద్రపు నాచు సాగు విస్తరణ పెంపకంపై కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పనపై సమీక్షించారు. ఈ సాగు ద్వారా వచ్చే సముద్రపు నాచుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ రానున్నదని ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఈ సాగును చేపట్టి మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని, ఆ దిశగా జిల్లాలో ఈ సాగు విస్తరణకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ నాచు ఉత్పత్తుల వల్ల వ్యవసాయానికి సేంద్రియ ఎరువులుగాను, పశువులకు పశు గ్రాసంగాను, చేపలకు కోళ్లకు మేత గాను, కాస్మెటిక్స్ తదితర రంగాలలో పర్యావరణ హితమైన ఉత్పత్తులను అందిస్తుందన్నారు. గచ్చ కాయల పోర, ఎస్.యానం, రాజోలు సముద్రతీర ప్రాంతంలో అనువైన ప్రదేశాలను ఆర్డిఓ కే.మాధవి సమన్వయంతో ఎంపిక చేయాలని అధికారులు ఆదేశించారు. తొలి దశలో 40 మంది ఔత్సాహిక స్వయం సహాయ సంఘాల మహిళలు మత్స్యకార సంఘాల ప్రతినిధులను గ్రూపులు గా విభజించి తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లా మండపంలో ఎంతో ప్రాచుర్యంలో ఉన్న ఈ సాగుపై శిక్షణను ఇప్పించేందుకు విధివిధానాల ను మరియు అందుకు అవసరమైన నిధుల లభ్యత పై నివేదికలను రానున్న మే నెల రెండో తేదీ నాటికి రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రీన్ క్లైమేట్ ఫండ్, ప్రధానమంత్రి మత్స్యకార యోజన తదితర పథకాల ద్వారా యూనిట్ల నిర్వహణకు కార్యచరణ రూపకల్పన చేయాలన్నారు. తొలి దశలో శిక్షణ ముగించి రెండో దశగా మండపం నుండి శాస్త్రవేత్తలను తీసుకుని వచ్చి సముద్ర తీరం వెంబడి ఉప్పు శాతాలు ఆధారంగా ఏయే రకాలైన నాచు ఉత్పత్తులు పెంపకానికి అనువుగా ఉంటాయో నిర్ధారించాలన్నారు. ఒక్కొక్క యూనిట్ నిర్వహణకు అయ్యే ఖర్చు అంచనాలు, ఫండింగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డ్ జిల్లా మేనేజర్ సహకారంతో రూపొందించాలన్నారు. ఆహారం, ఎరువుల కోసం స్థిరమైన ప్రత్యామ్నాయ పరిష్కారాలను రూ పొందించడానికి ప్రకృతి అందించే అద్భుత పంట అయిన సముద్రపు నాచు శక్తిని వినియోగించుకోవాలన్నారు. కార్బన్ను తగ్గించి సముద్రపు నాచు పొలాలకు ప్రత్యామ్నాయ ఎరువుగా సహాయపడుతుందన్నారు. తీరప్రాంత సమాజాలను శక్తివంతం చేస్తుందన్నారు. సముద్రపు నాచు ఎనర్జీ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన విధానాలను సృష్టించనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే.మాధవి, గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష, జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖ అధికారి ఎం.వి.ప్రసాద్ రావు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి శంకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, జిల్లా ఉద్యాన అధికారి బి.వి. రమణ, ఎల్డిఎం కేశవ వర్మ, డిఆర్డిఏ పిడి జై చంద్ర గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి నది పుష్కరాలు సందర్భంగా ప్రత్యేక బస్సులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** సరస్వతి నది పుష్కరాల సందర్భంగా మే 15 వతేది నుండి 26 వ తేది వరకు భక్తుల సౌకర్యార్థం తణుకు పరిసర ప్రాంతాలు పెరవలి పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు లు ఏర్పాటు చేస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిదర్ కుమార్ తెలిపారు. 35 మంది భక్తులు ఉంటే పుష్కరాల సమయం లో ఏరోజు అయినా బస్సు ఏర్పాటు చేస్తామని, ముందుగా తమనుసం ప్రదించాలని అన్నారు. పుష్ బ్యాక్ 2o2, టీవీ సౌకర్యం కలిగిన ఈ సూపర్ లక్సరీ బస్సు కు టికెట్ ధర కేవలం 2100 మాత్రమే అని, ఈ బస్సు లు తణుకు లో బయలుదేరి వరంగల్ భద్రకాళీమాత,వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారు, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, కాళేశ్వరం లోని మహాకాళేశ్వరస్వామి దర్శనం మరియు పుష్కర స్నానం, అనంతరం రామప్ప లోని రామప్ప దేవాలయం దర్శనం చేసుకుని తిరిగితణుకు చేరే సదవకాశం కల్పించామని ఈ అవకాశం ను తణుకు పరిసర ప్రాంత భక్తులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ సప్పా గిరిదర్ కుమార్ తెలియజేశారు. వివరములకు 63042 10265 నెంబర్ లో సంప్రదించాలని తెలిపారు. ఈసందర్భంగా సరస్వతి పుష్కర స్పెషల్ బస్సు ల గోడ పత్రికలనుఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో గ్యారేజ్ ఇంచార్జి గూడూరి శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ దయాకర్, సిస్టమ్ ఇంచార్జి సాయికుమార్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ పాల్గొన్నారు.